క్లుప్తంగా

కాలుష్య రహిత విశాఖ లక్ష్యం

- సైకిల్‌పై విధులకు హాజరైన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



బంగ్లా నుంచి ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత విశాఖ లక్ష్యంగా.. పర్యావరణ పరిరక్షణ దిశగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు. విధులు అనంతరం నడక మార్గాన ప్రధాన కార్యాలయం నుంచి బంగ్లాకు చేరుకున్నారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారంలో ఒక రోజు నగర ప్రజలు తమ సొంత వాహనాలు విడిచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

నర్సుల పదోన్నతుల జాబితాపై ఫిర్యాదు



ఆర్డీకి ఫిర్యాదు చేస్తున్న స్టాఫ్ నర్సులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో నర్సుల పదోన్నతుల సీనియార్టీ జాబితాల్లో అవకతవకలు జరిగాయని పలువురు నర్సులు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ సుజాతకు ఫిర్యాదు చేశారు. ఈ సీనియార్టీ జాబితాను సవరించిన తర్వాత పదోన్నతులు ఇవ్వాలని నర్సులు కోరారు. సీనియార్టీ జాబితాలో రోస్టర్ పాయింట్ అమలు చేయాలని కోరారు. కొంత మంది సిబ్బంది సీనియార్టీ జాబితాలో అక్రమాలకు పాల్పడినట్టు పేర్కొన్నారు. ఆర్డీని కలిసిన వారిలో కేజీహెచ్ స్టాఫ్ నర్సులు టి.గంగాభవానీ, జీవీఎస్ వరలక్ష్మి, పద్మజ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మహారాణిపేట: విశాఖపట్నం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అండ్ ల్యాబ్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, సెక్రటరీ గీత, కోశాధికారి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టచ్ స్టోన్ చారిటీస్ సేవలు విస్తృతం

డాబాగార్డెన్స్: టచ్‌స్టోన్ చారిటీస్ సేవా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నట్టు చారిటీస్ సభ్యుడు శృతి సాగరదాస ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేజీహెచ్‌లో పేషెంట్ సహాయకుల కోసం 12 ఏళ్ల కిందట ప్రారంభించిన సేవలు, గత ఆరు నెలల నుంచి టాటా మెమోరియల్ బాబా క్యాన్సర్ ఆస్పత్రి రోగి సహాయకులకు భోజనం పంపిణీ చేస్తున్నామన్నారు. పండగ సెలవులు అనంతరం శాంతి ఆశ్రమం, విశాఖ సేవాసదన్ స్కూల్, పోర్టు హైస్కూల్‌లో చదువుతున్న 700 మంది పిల్లలకు భోజనం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో జేసీఐ వైజాగ్ అచీవర్స్ సేవలు

డాబాగార్డెన్స్: జేసీఐ వైజాగ్ అచీవర్స్ తమ సేవలు గిరిజన ప్రాంతాలకు విస్తరించింది. జేసీఐ ఆధ్వర్యంలో అనంతగిరి మండలం గరిగుడి గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించి ఆయా గ్రామానికి రూ.లక్షతో ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అనంతగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీఐ వైజాగ్ అచీవర్స్ ప్రతినిధులు రంజీత్‌సాహూ, డాక్టర్ శీతల్, ప్రేరణ పాల్గొన్నారు.

అవ్వాతాతల సంతోషమే జగనన్న లక్ష్యం



పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ జానకీరామ్

డాబాగార్డెన్స్: అవ్వాతాతలు... అక్కా చెల్లమ్మల సంతోషమే జగనన్న లక్ష్యమని 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ అన్నారు. వార్డు పరిధిలో పలువురికి రూ.3 వేల పింఛన్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ అందజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకుడు మాసిపోగు రాజు, టీఎల్ఎఫ్ సెక్రటరీ కడితి రమణమ్మ, కాకి పద్మ, సచివాలయ కన్వీనర్లు సుధాకర్, కిషోర్, రమణి, శ్రీధర్, లియాకత్, సచివాలయ కార్యదర్శులు సుబ్బారావు, పాపారావు, స్మిత్ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ల నగదు అందజేస్తున్న కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్

37వ వార్డులో పింఛన్ల పంపిణీ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో పలువురు లబ్ధిదారులకు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సోమవారం పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి లబ్ధిదారులకు అందజేశారన్నారు. పాత పింఛన్లతోపాటు మరికొన్ని కొత్త పింఛన్లు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో యేసు, డేవిడ్‌రాజు, వాసు, సీహెచ్ సత్యవతి, కన్వీనర్లు సారిక దైవకుమార్, రమణ, నిమ్మకాయల ఆదిలక్ష్మి, రోజా, రమణి, ఆనంద్, శేఖర్, ఉమామహేష్, రామచంద్రరావు, వంశీ, సీవో సుధాకర్, ఏపీడీ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 04, ఇంజినీరింగ్‌కు 01, చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబురావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ టీపీవో అసిస్టెంట్ అపరంజిత, టీపీఆర్వో ఏపీడీ పద్మావతి, వాటర్ వర్క్స్ ఈఈ శేఖర్, ఏఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

డాబాగార్డెన్స్: నగరంలోని శ్రీకాశ్యప్ జూనియర్, డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు సోమ వారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పతంగులు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆట పాటలతో సరదాగా గడిపారు. డూడూ బసవన్నలు.. హరిదాసుల హరివిల్లులు.. భోగి మంటలు.. గొబ్బెమ్మలతో పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు నూతన దుస్తులు ధరించి సందడి చేశారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సీతమ్మధార : విశాఖ సిటీ వైడ్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ (డైమండ్ పార్కు) ప్రెసిడెంట్ మద్ది రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలండర్‌ని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు సోమవారం ఆవిష్కరించారు. దొండపర్తి సమీప సంగం, శరత్ థియేటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి మహేష్‌బాబు, కృష్ణ అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజర్లు సుధాకర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మామిడి శ్రీను, రామచంద్రరావు, జీవీఎంసీ ప్రసాద్, నున్న కృష్ణ, కాజా, నాని, నగేష్, అమర్, సంపంగి శ్రీనివాసరావు, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కేకేరాజు

పెన్షన్ల పెంపు కోసం మహిళల నిరసన



అరెస్టు చేసిన వారిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మహారాణిపేట: పలు రకాల పింఛన్లు పెంచాలని కోరుతూ ఏపీ మహిళా సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. కొంత మంది మహిళలు కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లడానికి చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు పలువురు మహిళలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళల పెన్షన్లను రూ.6 వేలకు పెంచాలని, విభిన్న ప్రతిభావంతులకు నెలకు రూ.7 వేలు ఇవ్వాలని మహిళా సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. మొత్తం 9 డిమాండ్లతో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అహ్మద్ ఉనీషా బేగం, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిప్పు పెట్టకండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : నగరంలో వ్యర్థాలకు నిప్పు పెట్టరాదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున వ్యర్థాలు పేరుకుపోతున్న దృష్ట్యా వాటిని తరలించేందుకు జీవీఎంసీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిందని, ఇప్పటికే తాత్కాలిక సిబ్బందిని, ప్రైవేట్ వాహనాలను చెత్త తరలించేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యర్థాల తొలగింపులో కొంత ఆలస్యం అవుతున్నందున నగర ప్రజలు సహకరించాలని కోరారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల సమీప ప్రదేశాల్లో రోడ్లు, బహిరంగ ప్రదేశాలు, పలు చోట్ల వ్యర్థాలు పోగుచేసి నిప్పు పెట్టడం ద్వారా విశాఖ నగరం కాలుష్యంతో నిండి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హానీ కలుగుతుందన్నారు. నగరంలో గల నివాసితులు, బహుళ అంతస్తులు, గేటెడ్ కమ్యూనిటీల వద్ద వ్యర్థాలకు నిప్పు పెట్టరాదని కమిషనర్ తెలిపారు. కాలనీవాసులు, నివాస సంక్షేమ సంఘ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇటువంటి చర్యలు చేపట్టిన వారిని అడ్డుకుని అవగాహన కల్పించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వ్యర్థాలకు నిప్పు అంటించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నగరంలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో కమ్ముకున్న పొగ

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఏయూ అభివృద్ధి



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య కె.సమత

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వర్సిటీ అధికారులు, డీన్‌లతో ఆమె మాట్లాడారు. విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనిచేస్తున్నారని, ప్రతి కుటుంబం నుంచి ఉన్నత విద్యావంతులు రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. దీనిని సాకారం చేసే దిశగా విశ్వవిద్యాలయంలో పటిష్ట బోధన వ్యవస్థతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన బంగ్లాదేశ్ దౌత్య అధికారి ఏయూలో పటిష్ట బోధన వ్యవస్థను చూసి ప్రశంసించారని ఆమె చెప్పారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం అభివృద్ధికి దోహదపడే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి సమర్థవంతంగా నిర్వర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియలో అందరి సహకారం, సూచనలు స్వీకరించి సమష్టిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతికి బాటలు వేస్తామని ఆమె చెప్పారు.

వైభవంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉక్కు ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందనిఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1061వ రోజు సంస్థకు చెందిన ఆర్ఎంహెచ్‌పీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. సరిపల్లి ఇసుక రీచ్, గర్భాం మాంగనీస్ గనుల లీజును పునరుద్ధరించాలనే డిమాండ్‌తో విజయనగరం జిల్లాలోని డిస్ట్రిక్ట్ మైనింగ్ అండ్ జూలాజికల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి నాయకులు తరలివెళ్లారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

రీడింగ్ రూమ్ పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రీడింగ్ రూమ్‌ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సోమవారం సందర్శించారు. రీడింగ్ రూమ్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని విద్యార్థులకు రిజిస్ట్రార్ సూచించారు.

హనుమంతవాకలో మందుబాబుల వీరంగం



హనుమంతవాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట మందుబాబులు

ఆరిలోవ: హనుమంతవాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట మందుబాబులు సోమవారం సాయంత్రం వీరంగం వేశారు. పూటుగా మద్యం తాగిన మైకంలో ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. దీంతో బస్సులు, ఆటోల కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఆందోళన చెందారు. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఎదురుగా మద్యం దుకాణం ఉంది. ఈ దుకాణంలో మద్యం సేవించిన కొందరు గ్రూపులుగా విడిపోయి కొట్లాటకు దిగారు. సాయంత్రం కావడంతో నగరం నుంచి ఆరిలోవ వైపు వెళ్లే వాహనాలు, ఆరిలోవ వెళ్లే బస్సుల కోసం అక్కడ ఎదురుచూసే మహిళలు, కళాశాలల విద్యార్థులు ఆ కొట్లాటకు బెంబేలెత్తిపోయారు. వారంతా భయంతో రోడ్డు పక్కకు పరుగులు తీశారు. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఈ గొడవ మాకెందుకులే అనుకున్నారో ఏమోగాని ఒక్కరూ సమయానికి స్పందించలేదు. దీంతో కొందరు ప్రయాణికులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి గొడవ విషయాన్ని చెప్పడంతో అప్పుడు కానిస్టేబుళ్లు వచ్చి మందుబాబులను చెదరగొట్టారు. దీంతో గొడవకు బ్రేక్ పడింది. గొడవ మరింత పెద్దది కాకుండా ఆగినందుకు ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



37వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


మందుల ఖర్చుల కోసం రూ.5 వేల చొప్పున 10 మందికి రూ.50 వేల సాయం

డాబాగార్డెన్స్: ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన వినతులు స్వీకరిస్తూ సమస్యలు పరిష్కరించడంతోపాటు ఆర్థిక సాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, మృతి చెందిన మహిళల కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో నేనున్నానంటూ భరోసా కల్పించారు. జీవీఎంసీ 39వ వార్డు కోటవీధికి చెందిన మైలపిల్లి అప్పలనరసింహ, 37వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి, 37వ వార్డు తెలకలవీధికి చెందిన కొల్లాబోయిన వీర్రాజుకు, గొల్లవీధికి చెందిన రాగత కొండమ్మ, 35వ వార్డు వెలంపేటకు చెందిన చోడవరపు లక్ష్మి, పండావీధికి చెందిన పుర్రి దుర్గాప్రసాద్, పోలవరపు ఆదిలక్ష్మి, 33వ వార్డు గోవిందరోడ్డుకి చెందిన మాచర్ల రవి, గౌరీస్ట్రీట్‌కు చెందిన కాండ్రేగుల చిరంజీవి ఇంటికి నేరుగా ఎమ్మెల్యే గణేష్‌కుమార్ వెళ్లి పరామర్శించారు. ఒక్కొక్కరికి వైద్య ఖర్చులు, మందుల కొనుగోలుకు రూ.5వేలు చొప్పున రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండుసార్లు తనను గెలిపించడంతో బాధ్యతగా సేవలందించానని... మూడో సారి కూడా గెలిపించేందుకు తనను ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, మరింత సేవ చేసి చూపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్స్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ స్టేట్ డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



తెలకలవీధికి చెందిన వీర్రాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్‌కుమార్

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



విశేష పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 26వ రోజు సోమవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2500 మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

11న మహాన్నదానం

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి గురువారం (ఈ నెల 11న) మహాన్నదానం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు.

అప్పన్న కుటుంబానికి అండగా ఉంటాం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన ఫిషింగ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ సభ్యుడు మారుపల్లి అప్పన్న కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో అప్పన్న కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ యూనియన్ (ఏఐటీయూసీ) తరపున వారి కుటుంబ సభ్యులకు బోట్ యాజమాన్యంతో మాట్లాడి రూ.2 లక్షలు అందజేశామని మృతుని భార్య మారుపల్లి తోటమ్మ, మృతుని పిన్ని మారుపల్లి అప్పయ్యమ్మకు తెలిపారు. అనంతరం యూనియన్ తరపున రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తం అందేవిధంగా బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంకా గురుమూర్తి, అధ్యక్షుడు కోడా వజ్రం, ప్రధాన కార్యదర్శి పాత్రిపల్లి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



అప్పన్న కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

పాత చలానాలు రద్దు చేయాలి

సీతమ్మధార : ఆటో డ్రైవర్లపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) నాయకులు ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ డ్రైవర్లపై వేల రూపాయల జరిమానా వేసే జీవో నంబర్ 21ను రద్దు చేయాలన్నారు. వ్యాన్లు, లారీలు, కార్లు, జీపులకు 30 శాతం ట్యాక్స్ పెంచుతూ విడుదల చేసిన జీవో నంబర్ 31ని ఉపసంహరించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఆటో డ్రైవర్లకు జగనన్న ఇల్లును వెంటనే మంజూరు చేయాలన్నారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

కసిరెడ్డికి పరామర్శ

అల్లిపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి సోమవారం తన నివాసంలో పరామర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీఎస్ క్షేత్రపాల్, సీహెచ్.కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.



కసిరెడ్డి సత్యనారాయణను పరామర్శిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు